

# కన్నెకల

**- సర్వజిత్**

కాత్యాయని ఆగుడిచుట్టూ ఎన్నిసార్లు తిరిగిందో ఆమెకే తెలీదు

గుడిముందు మండపంలో జరుగుతున్న పెళ్ళిని చూస్తూ ఆమె గుడిచుట్టూ ప్రదక్షిణలు చేస్తోంది చేస్తూ ఆలోచిస్తూన్నది ఆమెకి అంతర్గతంగా ఏదో కలుకుతూన్నట్టుంది

ఆ పెళ్ళికొడుకేం బావున్నాడని? పెళ్ళికూతురు మాత్రం! పట్టుచీర కడితే సరి పోయిందా ఆమె ఆలోచిస్తూ తిరుగుతోంది

బొండు మల్లిలా వికసించిన కాత్యాయనికి ఆమె వేసుకున్న జాకెట్టు ఓణీ ఆమె శరీరాన్ని కప్పలేక పోతున్నాయి

బారెడు జడ ఇంతింత కళ్ళూ కుందనపు బొమ్మలా ఉన్న ఆమెకి ఆ పెళ్ళికూతుర్ని చూస్తే బాధ కల్గడం సహజం

ఆమె అక్క పెళ్ళి చేసి చతికిల బడిపోయిన తండ్రి ఇప్పుడు కాత్యాయని పెళ్ళి చేయడానికి విఫల యత్నాలు చేస్తున్నారు

కాత్యాయని బంగారు బొమ్మే! కానీ పెళ్ళికొడుకుల వేలం పాటలో తండ్రి నెగ్గుకు రాలేకపోతున్నాడు

ఆమె వయస్సు పెరుగుతోంది ఆశలూ పెరుగుతూన్నాయి ఇన్ని పెరిగి చివరికి విసుగు, నిరాశ చోటు చేసుకుంటున్నాయి

నాన్న కట్నం ఇవ్వలేడు తనకి పెళ్ళి కాదు ఈ ఆలోచనే ఆమెను తినేస్తోంది తన స్నేహితురాలు సుభద్ర మొహం ఛాచిప్పలా ఉంటుందంటారు అంతా అయితేనేం పెళ్ళయ్యింది కామాక్షికి అయ్యింది రెండో సంబంధం

మండపంలో పెళ్ళికూతురు ఏంబావుందని పెళ్ళవుతోంది! డబ్బు కమ్ముకొచ్చింది చాలు మనస్సూ రూపూ రేఖా ఏవీ అక్కర్లేదిమగాళ్ళకి

దేవుడి మీద మనస్సు నిలవటల్లేదు కాత్యాయనికి ఆలోచనలన్నీ ఆ పెళ్ళి మీదనే ఉన్నాయి

వాళ్ళు తలంబ్రాలు పోసుకుంటున్నారు అసలు వాళ్ళ కన్నా పై వాళ్ళ హడావుడి ఎక్కువగా ఉందక్కడ

కాత్యాయనికి ఇక తిరగాలనిపించటల్లేదు

నిజానికి ఒక నెల నుంచి ఆమెకీ గుడి పూజలు-ఎక్కువయ్యాయి అప్పుడెప్పుడో ఓ ముసలమ్మగారు బోల్డంత సాను భూతి చూపించి ఇచ్చిన సలహాని కాత్యాయని నల్లురిలోనూ కొట్టిపారేసింది

## "కవితా సంస్మరణ"

మాట మాటను తేట
మధుర భావపు ఊట
లలిత పదముల తోట
కృష్ణశాస్త్రి పాట

భక్తిగీతము పాడ
భగవానుడే కరుగు
రక్తి గానము చేయ
రాళ్ళయిన ఒరుగు!
ఆర్తినాలాపించ
అశ్రువుల్ కురియు
పూలు పరచిన బాట
కృష్ణశాస్త్రి పాట

అపురూప మా పలుకు
అమృతము చిలుకు
అన్యు లెరుగని రీతి
అమర మాతని ఖ్యాతి

తనదైన ఒకవాణి
తనదైన ఒకబాణి –
బాషలో బావాన
ఉక్తిలో శక్తిలో
ఉదయ నవతా భరిత
కృష్ణశాస్త్రి కవిత!

అబ్ధి యంతటి లోతు
శబ్దమాతని పాతు
మధుర బావ భరిత
కృష్ణశాస్త్రి కవిత

—మేకా సుదాకరరావు

## కన్నెకల

చదువూ లేక పెళ్ళీ లేక ఇంటి దగ్గర ఊరికే కూర్చున్న ఆమె ఆ ముసలమ్మ గారి మాటల్నే మననం చేసుకుని ఇప్పుడీ పూజలూ గుడీ అలవాటు చేసుకున్నది ఇంటికి ఫర్లాంగు దూరంలో గుడి

పాసు మార్కులతో టెన్త్ గట్టెక్కిన కాత్యాయనికి పై చదువులకి సీటు ఎలానూ రాదు

డొనేషన్లు పోసి చదివించే ఓపికే ఉంటే నీకు పెళ్ళికొడుకుని తేకపోదునా అన్నాడు తండ్రి

ఆమె ప్రదక్షిణలు చాలించి గుడిలో కెళ్ళింది

రోజూ తన గురించీ తన పెళ్ళి గురించి దేవుడిని వేడుకునే కాత్యాయని ఆ రోజు క్షణం అచేతనంగా అయిపోయింది చంద్రానికి ఉద్యోగం వచ్చేట్టు చూడు స్వామి అప్రయత్నంగా దేవుడిని వేడుకుని బయటికి వచ్చింది

వద్దనుకుంటూనే మండపంలో పెళ్ళి కేసి చూసి గుడి వెనక రావిచెట్టు దగ్గర కెళ్ళింది

తిరగడం దర్శనం అన్నీ అయ్యాయన్న మాట అన్నాడు అక్కడ కూర్చున్న చంద్రం

అవునన్నట్టు తలాడించింది నవ్వుతూ.

మీరెప్పుడొచ్చారు? అడిగిందామె

నువ్వు గుళ్ళో ఉన్నప్పుడు

ఇంటికంటే గుడి పదిలంగా ఉన్నదన్నమాట!

చంద్రం నవ్వేడు ఒక విధంగా అంతే

ఇక్కడ వరాలిచ్చే దేవుడూ నాస్వీట్ హార్ట్ ఉన్నారుగా

అతని మాటలకి కాత్యాయని హాయిగా నవ్వింది

కొంచెం దూరంగా అడపాతడపా పెళ్ళి మంత్రాలు వినపడుతున్నాయి

ఇంటర్వ్యూలు ఏమీ లేవా? కాస్సేపటికి నెమ్మదిగా కాత్యాయని అడిగిందతన్ని

లేకేం మూడున్నాయి విశాఖ బెంగుళూరు మద్రాసు లేనిది సొమ్ములే వెళ్ళడానికి

ఆ మాటకి ఆమె బాధపడింది క్షణం గబగబా ఆలోచించింది ఎక్కడైనా అప్పుచేసి ఇవ్వ గలదేమోనని కానీ తను ఎంత ఇవ్వగలదు! పోనీ తన వంటి మీద బంగారం ఏసరేనా ఉందా ఇంట్లో వాళ్ళకి పడిపోయిందని చెప్పి అతనికిచ్చి అమ్మేసుకోమందామంటే తను పెట్టుకున్నది కాకీ బంగారం

ఏదో ఒక ఉద్యోగం దొరికి నాబాగుండును తనకి తను అనుకొంటున్నట్టు అన్నది

చూద్దాం ఏదో ఒక రాయి తగలక పోతుందా

అని చుట్టూ చూసి ఆమె చేయి అందుకుని సున్నితంగా నొక్కి వదిలాడు చంద్రం

నీకు ఉద్యోగం రావాలని వేయిదేవుళ్ళకి మొక్కుతున్నాను వస్తే అమ్మాయిగారికేమిటో లాభం

పాపం తెలీదా!

తమ నోటితో చెబితే తరిస్తాంగా

మూతి ముచ్చటగా మూడు వంకర్లు తిప్పిందామె

పెళ్ళి చెయ్యి భగవంతుడా అని ఆమె ఉద్యోగం ఇప్పించు భగవంతుడా అని అతను గుడికి రావడం అక్కడ పరస్పర పరిచయం ఓ క్షణంలో పరిచయం కొన్నాళ్ళకి స్నేహం అనుకున్న ఆ ఆలోచనల్లో ఏదో ఆర్తి వాళ్ళిద్దర్ని సన్నిహితం చేసింది

లంచం ఇస్తేనే గాని ఉద్యోగం రాదు కట్నం ఇస్తేనే గానీ పెళ్ళి కాదు సమాజంలో ఈ రెండూ కేన్సర్ లాంటి వ్యాధులు అని ఓ రోజు చంద్రం ఆవేశంగా అంటే,

ఇంతకీ మీకెంత కట్నం కావాలి? అని కాత్యాయని ప్రశ్నించగా చంద్రం బాద పడిపోయేడు

ఇన్నాళ్ళ సాహచర్యంలో నేను నీకు అంతే అర్ధమయ్యా నన్నమాట చూడు కాత్యాయనీ నేను నిన్ను పెళ్ళి చేసు కుంటాను కానీ కట్నం పైసా లాంఛనాలూ లేకుండా ఆలస్య మంటూ ఉంటే అది నాకు ఉద్యోగం రావడమే ఐ లైక్ యూ కాత్యాయనీ అంటూ ఆమె చెయ్యి అందుకుని సున్నితంగా ముద్దు పెట్టుకున్నాడు చంద్రం

ఆ స్పర్శకి ఆమె పులకించింది ఎవరైనా చూస్తారేమో నని కంగారు పడింది కూడా

ఒకరి కొకరు అన్న బావనకి అదే నాంధీ అయ్యింది ముసలమ్మగారి హితోపదేశం పని చేస్తున్నదని కాత్యాయని లోలోపల సంబర పడింది అందుకే ఎన్ని పనులున్నా గుడికి రావటం మానటల్లేదామె

నిత్యం కాత్యాయనికి ఇదేధ్యాస అతను అందగాడా అంటే కాకపోవచ్చు చూడ్డానికి మొరటులా కనిపిస్తాడు కానీ అతనిలో అదేమీ ఆమె చూడలేదు తనకి దగ్గరవాడు ఒకే పడవలో ప్రయాణిస్తూ తనను అబిమానించి అక్కున చేర్చుకున్న వాడూ కనక చంద్రం ఆమెదృష్టిలో మంచివాడు!

ఎన్నిసార్లో పెళ్ళి చూపుల వేషం వేసి తప్పిపోయిన ఆ పెళ్ళిళ్ళ గురించి ఆలోచించడం బాదపడ్డం ఇప్పుడు మానేసింది కాత్యాయని

ఇప్పుడు రోజూ అతన్ని చూడ్డం అతని ఉద్యోగం కోసం ప్రార్థించడం ఆ సగటు కన్నెపిల్ల కాత్యాయని వ్యాపకం అయిపోయేయి

* * * *

నెలపైన గడిచాక

ఓ రోజు ఉదయం గుళ్ళో మరెవరేనా ఉన్నారేమో కూడా చూసుకోకుండా గబుక్కున కాత్యాయనిని దగ్గరికి లాక్కుని ఆమె నొసట ముద్దు పెట్టుకున్నాడు చంద్రం

ఈ హఠాత్ సంఘటనకు ఆమె గాబరా పడింది

ఏవిటా హడావుడి? ఎవరేనా చూస్తే! అందామె

చూస్తే చూడనీ గాక!

ఇంతకీ ఏవిటా హుషారు?

చెప్పేముందు యురేకా అని అరవాలనుంది

సోది ఆపి సంగతి చెబుతావా వెళ్ళనా!

ఉండు గుడ్ న్యూస్ వినేముందు కొంత బోరు భరించాలి

భరించాగా ఇక చెప్పు

నాకు ఉద్యోగం వచ్చింది

నిజంగా క్షణం ఆమె కళ్ళలో నీరుబికింది ఆనందంగా

రేపే ప్రయాణం ఎల్లుండి వెళ్ళి జాయినవ్వాలి మళ్ళీ సాయంత్రం ఇక్కడికేరా తీరిగ్గా మాట్లాడుకుందాం

సంతోషంతో కాత్యాయనికి మాటలు రాలేదు అలాగేనన్నట్టు తలూపింది

చంద్రం గురించీ అతనితో తన అనుబంధం గురించీ అన్నీ ఇంట్లో చెప్పేద్దామన్నంత ఉద్వేగం వచ్చిందామెకి

ఆ సాయంత్రం ఇద్దరూ చాలా సేపు కబుర్లు చెప్పుకున్నారు స్వీటు సగం సగం పంచుకుని తిన్నారు

జీవితంలో సగం మెట్లు ఎక్కేసినట్లు ఆమె సంబరానికి అవధుల్లేవు

అతను ఉద్యోగానికి వెళ్ళిన మర్నాటి నుంచీ ఉత్తరాల కోసం ఎదురు చూసింది

రోజులు గడుస్తున్నాయి కానీ ఉత్తరాలు లేవు అతని నుంచి

ఆమె ఆరాటం ఎక్కువవుతున్నది అంతరంగంలో సన్నని వణుకు తనకి తెలీకుండానే ప్రారంభమయ్యింది

మళ్ళీ నిరాశ మందకొడితనం ఒక్కొక్కటిగా ఆమెను చుట్టు ముడుతున్నాయి నెలలు దాటాయి అతని నుంచి ఏ సమాధానమూ లేదు వివరాలు కనుక్కుందామన్నా అతని స్నేహితు లెవరూ ఆమెకి తెలీదు

ఇప్పుడామెకి గుడికి రావాలని పించటల్లేదు కానీ వస్తోంది మండపంలో ప్రశాంతంగా కూర్చోవాలని ప్రయత్నిస్తోంది

ఈ పరిస్థితుల్లోనే మళ్ళీ పెళ్ళి చూపుల వేషం వేయాల్సి వచ్చినప్పుడు గుండె బరువెక్కి కళ్ళ నీళ్ళు తిరిగాయి కాత్యాయనికి

కానీ ఎప్పటిలా ఆ పెళ్ళి చూపులు పెద్ద ఆర్భాటంగా జరగలేదు పెళ్ళి కొడుకూ ఓ ముసలాయనా ఇద్దరు ముత్తయిదులూ వచ్చారు అతను నలభైయేళ్ళ రెండో పెళ్ళి కొడుకు

కాత్యాయని మనసు మొరాయించినా పెరిగే వయస్సు అప్రయత్నంగా ఊకొట్టింది ఎలాగో ఆ తతంగం అయ్యిందనిపించింది

ఆమె అభిప్రాయం ఎవరూ కనుక్కోలేదు నిశ్చితార్థం అయిపోయినట్లు వాళ్ళు మాట్లాడేసుకుంటున్నారు, ఇంతకంటె నేను తేలేనమ్మా అన్నట్లు వాళ్ళతో మాట్లాడుతూనే కాత్యాయని కేసి జాలిగా చూస్తున్నాడు ఆమె తండ్రి

ఆమె తండ్రిని చదవగలిగింది అతని గుండెల్లో బరువునీ అర్థం చేసుకున్నది వాళ్ళు వెళ్ళి పోయారు

అలజడి నిండిన కాత్యాయని గుడికి బయలు దేరింది

గుండెలో తుల కోర్కెని భగవంతునికి నివేదిద్దామనా! ఒకవేళ గుళ్ళో చంద్రం ఉన్నాడేమో!

ఇదే చివరి ప్రయత్నమా అంతరంగంలో చావని ఆశ మరో ప్రక్క అలజడి

గుళ్ళో మండపంలో స్థంభాని కానుకుని చాలాసేపు కూర్చున్నది

ఆమె మనస్సు మొద్దుబారింది

రెండో పెళ్ళి కొడుకు రూపం క్షణం కళ్ళలో మెదిలింది దూరంగా దూరంగా లీలగా చంద్రం రూపం అస్పష్టమై పోతోంది

మండపం మించి లేచింది గుడి లోపల కెళ్ళాలనిపించటల్లే దామెకి అనాలోచితంగా గర్భగుడి వైపు చూసింది

సరిగ్గా అప్పుడే సతీసమేతంగా గుడిలోంచి బయట కొస్తున్నాడు చంద్రం అతన్నలా చూడగానే లిప్తకాలంపాటు అచేతనంగా అయిపోయి ఎలాగో తేరుకున్నదామె

చంద్రంగారా! బావున్నారా! మీ శ్రీమతా! అనడిగింది కాత్యాయని వ్యంగ్యంగా

గుండెకోస కారం అద్ది సెగల మీద కాలుస్తున్నంత బాధగా ఉన్నదామెకి అతను మాట్లాడలేక పోయాడు

నా పేరు కాత్యాయని లెండి మీ వారికి ఒకప్పుడు కావలసినదాన్ని అని పెళ్ళి కూతురితో చెప్పి చప్పున వెనుదిరిగిన కాత్యాయని ఒక్కసారి వెనక్కి తిరిగి చూసింది

అతని ముఖంలో కత్తి వేటుకి నెత్తురు చుక్కలేదు మలినం లేని మనసున్న మనిషిని చెయ్యి భగవంతుడా? అన్నట్లు దేవుడివైపు చూసి నవ్వుకుంటూ వెళ్ళిపోయిందామె

అది నవ్వు కాదు! గుండె పగిలిన కన్నీళ్ళు పెల్లుబుకడానికి ముందు అంటే ఉప్పెనకి ముందు ఉరిమిన ఆకాశం ఇప్పుడామెకి రెండో పెళ్ళి కొడుకు రూపం మరింత చేరువవుతున్నట్లని పిస్తోంది □



ఇటీవల కాశీ హిందూ విశ్వ విద్యాలయం తెలుగు శాఖ రజతోత్సవాలు ఘనంగా జరిగాయి ఆ ఉత్సవ సభలో వేదికనలంకరించిన ఆర్ట్సు ఫాకల్టీ డీను ప్రొ ఆనందకృష్ణ కులపతి ప్రొ ఆర్ ఎ రస్తోగి ఛాన్సలర్ మరియు కాశీరాజు డా విభూతి నారాయన్ సింహ్ శ్రీ పెండేకంటి వెంకటసుబ్బయ్య (బీహారు రాష్ట్ర గవర్నరు) వారి సతీమణిగార్లని చిత్రంలో చూడవచ్చు *

